# ఊబి

చిత్ర పరుగెత్తుతోంది. భుజాన పుస్తకాల సంచీ బరువు ఉంది. వగరుస్తూ పరిగెడుతోంది. 'అమ్మో, టీచరు చంపేస్తుంది' అనుకుంటోంది. అల్లా పరుగెత్తి రైల్వే స్టేషన్ దగ్గర ఆగింది. అది వూరికి చివర. రైలు ఆగి వుంది. మెట్లు ఎత్తుగా వున్నాయి రైలు పెట్టెకి. ఐనా సంచీ గట్టిగా పట్టుకొని ఎక్కేసింది. ఎంతో కష్టమైంది. ఆయాసం వచ్చింది. ఆ తలుపు మూల నక్కి కూచుంది. రైలు కదిలింది. ఆకలి, నిద్ర, ఏడుపు కాసేపటికి ఒక ముష్టి మనిషి చూసింది చిత్రని. "ఏయ్ పిల్ల" అని పిలిచి 'నాతో రా' అని తీసుకెళ్లింది. కంపార్టుమెంటులో సీట్ల మధ్య నడిపిస్తూ, తనలాగే చేయి చాపి అడుక్కోమంది. బజ్జీలు, టీ కూడా యిచ్చింది.

బడి వదిలి, వూరు వదిలి, అమ్మను వదిలి దూరంగా వెళ్ళిపోతున్నది చిత్ర. అమ్మ, చిత్తుగా తాగేస్తుండేది. రోజూ యింత అన్నం మాత్రం పిల్లకి పడేసేది. ఎప్పుడైనా నాలుగు డబ్బులూ యిచ్చేది. ఇంటి పక్క పిల్లలతో కలిసి బడికి వెళ్లేది చిత్ర. అమ్మ యిచ్చే చిల్లర డబ్బుల లెక్క తెలియదు. అవి యిస్తే ఒక బిస్కెటు ప్యాకెట్టు యిచ్చేవాడు దుకాణదారుడు. దయతలచి స్కూలు పుస్తకాలు పాతవి యిచ్చేవాడు. ఇంటి నుంచి బడికని ఎప్పుడో బయలు దేరేది. దోవ తప్పేది. లేటుగా వచ్చినందుకు టీచరు తిట్టేది. ఒక రోజు అమ్మ 'యీ వేళ నీ పుట్టిన రోజే చిత్ర! ఇవి పిల్లలందరికీ యివ్వు', అని పిప్పరమెంటు బిళ్లలు కొని యిచ్చింది. అవి పుచ్చుకొని క్లాసుకి చేరేసరికి ఇంకా లేటయింది. కొత్త టీచరు 'ఏమిటి యిప్పుడా రావడం!' అని ఒక్క దెబ్బ వేసింది. చిత్ర దూరంగా పోయి వెనకాల కూచుంది. బిళ్లలు పిల్లలకి యిచ్చింది. 'నా పుట్టినరోజు' అని చెప్పింది. టీచరు చూసింది దగ్గరకు వచ్చి 'ఒసేయ్, ఏమిటి వాగుతున్నావు?' అని మరో దెబ్బ వేసింది. ఇందాకా కొట్టినందుకు చెంప మండిపోతోంది. ఇప్పుడు యీ దెబ్బ మరీ చుర్రుమన్నది. ఒళ్ళు భగ్గుమంది. కోపంతో పలక పుచ్చుకొని టీచరు చేతి మీద గట్టిగా కొట్టింది. 'అబ్బా' అని టీచరు చెయ్యి వెనక్కి తీసుకుంది. చిత్ర వణికిపోయింది. టీచరు తనని పట్టుకునే లోగా వెనక తలుపులోంచి ఒక్క పరుగు తీసింది. బయటికి వచ్చి పడినా యింకా వణుకు తీరక, పరుగెత్తుతూనే వుంది.

ఇదంతా, ఆ ముష్టి మనిషికి ఆ తర్వాత చెప్పుకుంది. తన వూరు, తన యిల్లు, మామిడి తోటల్లో ఆటలు అన్నీ చెప్పింది. అమ్మను మరచిపోతోంది. ముష్టి వాళ్లతో కలుస్తూ గుడిసెల్లో బతుకుతూ కడుపు నిండా తింటూ, ఎక్కడో ఒక చోట నిద్రపోయేది. ఎవరో బట్టలూ యిచ్చేవారు. స్నానం చేస్తే హాయిగా అనిపించేది. నాలుగు బట్టలు పోగు చేసుకొని అవే వుతుక్కొని కట్టుకునేది.

చిత్ర పొడుగైంది. వయస్సు వచ్చింది. ఎప్పుడో, ఎక్కడో వళ్లు అమ్ముకోవడం ఆరంభమైంది. వ్యభిచారంలోకి దిగింది. చేతుల్లో డబ్బులు ఆడుతున్నాయి. ఇప్పుడొక పుణ్య క్షేత్రంలో బస్సు స్టాండులో

వుంటోంది చిత్ర. వయస్సు యిరవై మూడేళ్ళు. ఒక పాప. తండ్రి ఎవరో తెలియదు. తన పసితనమే మర్చిపోయింది. ఇంక తన కూతురి బాల్యం చూసి మురిసే మనస్సు ఎక్కడుంది?

బస్సు స్టాండు వెనకాల ఒక గది వుంది. అక్కడే ఆమె వృత్తి. ఆ యిరుకు గదిలోంచి బయటకు వచ్చి బస్సు స్టాండులో వున్న అరుగు మీద పడుకొంటుంది. ఉన్న డబ్బులోనే అలంకరణ, ఏదో ఒకటి చేసుకొంటుంది. ఆ బిడ్డను సాటి వాళ్లెవరో ఎత్తుకొంటారు.

"చిత్ర!" ఎవరేనా పిలుస్తారు. వళ్లంతా వూపుకుంటూ లేని వయ్యారాలు వలకబోస్తూ నడుస్తుంది. తళుక్కుమనే బొట్టు పెట్టుకుంటుంది. పొడుగాటి లోలాకులు, కారణం లేకుండా నవ్వుతుంది. మూతి చివర్లో జారిపోయి ఒక విషాదం నవ్వు వంపులో. ఆ చుట్టు ప్రక్కలే చెత్త మనిషిలా పెరిగిన చిత్ర వంక మగవాళ్ళు చూస్తారు. 'అది' ఎవరో వాళ్లందరికీ తెలుసు. నల్లని కనుగుడ్లు, విశాలమైన కళ్లల్లో వెలుగు కాదు. ఎర్రని చార వుంటుంది. మాట్టాడగానే తెలుస్తుంది ఆమె ఎదగని పసి బిడ్డ అని, బాలిక లాంటి లేత కంఠం అల్లాగే వుండిపోయింది. ముద్దు మాటలు అంటోంటే ఆమె మనిషిగా ఎదగటం ఎక్కడో ఎప్పుడో మానేసిందని అనిపిస్తుంది.

ఆమెని సంఘసేవికలు పట్టుకున్నారు. 'వృత్తి చేసుకో కానీ నీ వళ్లు చూసుకో. నీ వల్ల నలుగురు మగవాళ్లు లేదా నలుగురు మగవాళ్ల వల్ల నీవు జబ్బు పడవద్దు. రోగాలు వ్యాపింప చేయకండి' అని చెప్పారు. రక్షిస్తాం అన్నారు. ఆమెకి వైద్య పరీక్షలు చేసి మందులిచ్చి, కండోమ్స్ ఇప్పించారు.

తనని రక్షిస్తారు సరే, కానీ చిత్ర తన జీవితంలో యిప్పుడేం చేస్తుంది? ఏ పనీ చేతకాదు. ఆమె ఎటూ పోలేదు. తల్లి వుందో పోయిందో తెలియదు. తనకి కన్న బిడ్డ ఒక్కతి వున్నది. అది మాత్రం సత్యం. కులం, వంశం, తేడా లేని ఆ బిడ్డను చూసినప్పుడు చిత్ర కళ్లల్లో వెలుగు, దానికి ఏదో మంచి చేయాలి. బతుకు కల్పించాలి తనలాగా కాకూడదు.

చిత్ర ఒక దీన వనిత. కానీ హుందాతో తల ఎత్తుకుని, నిటారుగా వెన్ను సవరించుకొని నిలబడి బతకాలని ప్రయత్నిస్తున్న ఒక సెక్సు వర్కరు.

ఊబిలో పడింది. సుడిగుండంలో చిక్కుకుంది. చిత్ర లాంటి ఆడదాని శరీరానికి గిరాకీ వుంది. అంటే అవసరమైన 'సేవలు' అందిస్తోంది. జీవనం గడుపుకుంటోంది. ఆమె కళ్లు దిగులు నిండిన కారు మబ్బులు. ఆమె పసితనాన్ని, అమాయకత్వాన్ని సంతోషాన్ని యీ లోకం మటు మాయం చేసింది. ఆమె బతుకు కల్మషాన్ని జరిగే దోపిడీని యీ పవిత్ర భూమి సహిస్తున్నది. చిత్ర లాంటి వారెందరో? ఆ సంఖ్య పెరుగుతోందంటే గుండె పగలదా? చిత్ర లాంటి మనిషిని చచ్చిపోనిద్దాం. కానీ మానవాళిని రోగాల బారినుండి కాపాడుదాం. అదే యీనాటి నిత్య న్యాయ సమ్మత విధానం ఔష్టా?

**(ఇది వాస్తవ గాథ, చిత్ర చెప్పుకున్న కథ)**

**– భూమిక**
**జూన్, 2007**